## 21

# నిరంతర సాధన

మనిషి ఉన్న ఫళంగా రోడ్డుమీద కళ్ళు తిరిగి పడిపోయ్యాడు. చుట్టు పక్కల జనం గుమిగూడారు. నీళ్ళు తెచ్చి చల్లండన్నారు. ఇలాంటి వాళ్ళకు నీళ్లు కాదు గొంతులో మందు పడాలి అన్నారు. మాదక ద్రవ్యాల బానిసేమోనని కొందరు పరిశీలనగా చూశారు. చుట్టు చేరిన జనానికి మనిషి మెడలో అట్టముక్క కనిపించింది. తీరా చూస్తే, అది ఆ మనిషి విజిటింగ్ కార్డు. దానిమీద కొన్ని సూచనలు కూడా ప్రత్యేకంగా రాసి ఉన్నాయి. మూర్ఛ బిళ్ళలా ఇదేమిటీ విడ్డూరం ? బయోడేటా మెడలో కట్టుకున్నాడూ ?" - అని అంతలోనే ఉద్యోగినులు సన్నాయి నొక్కులు నొక్కారు.

"మనిషి ప్రభుత్వ యంత్రాంగంలో ఐ. ఎ. యస్. అధికారి. కొంచెం మతి చలించి నప్పటి నుండి ఏదో యూనివర్సల్ ఇన్‌స్టిట్యూట్‌కు గౌరవ ఉపాధ్యక్షుడిగా ఉంటున్నాడు. పూర్వాశ్రమంలో బ్యాంక్ జనరల్ బంట్రోతుగా ఉన్నప్పుడు 'బుర్ర' - కతలు పాడేవాడు. ఈ మనిషికి 'సభాకింకర' - విశ్వవిఖ్యాత వాక్స్కలన ధురీణ' - అనే బిరుదులున్నాయి. అవి ఏనుగులబోతారం, పందిరి గుంజ గ్రామాల్లో జరిగిన బ్రహ్మాండమైన బహిరంగ సభల్లో ఇచ్చినవి. "తెలుగురత్న" బిరుదులు సంపాదించడం అతనికి కొట్టిన పిండి. సభలూ సన్మానాలూ లేని రోజులు వరుసగా వస్తేగనక, మూర్ఛవచ్చి కింద పడుతుంటాడు. ఆయనకున్న బలహీనతల్లో ఇదొకటి !

ఇదొక సరాల బలహీనత - దీనికి చికిత్స లేదు. సభ పెట్టి మాట్లాడించడం తప్ప - మందు లేదు. చప్పట్లు ఎంత ఎక్కువగా

కొడితే, ఆయన వ్యాధి అంత త్వరగా నయమౌతుంది" - అందులో మొత్తం వివరాలున్నాయి.

పాత్రికేయు డొకడు రంగ ప్రవేశం చేసాడు. వెంటపడి ఇంటర్వ్యూ చేసి, కూపీలాగి మనిషి విషయాలు పత్రికల్లో ప్రచురించాడు. నలుగురికీ తెలియజేసాడు. దాంతో మనిషికి ఆకాశవాణి, దూరదర్శన్‌లలో బోలెడు కవరేజీ ఉచితంగా వచ్చింది.

*　*　*

మనిషి వాగుడుకు అలవాటు పడ్డాడు. సాయంత్రం కాగానే, అతనిలో విపరీతమైన వాగుడు కాంక్ష ప్రజ్వరిల్లి పోతుంది. ఉద్యోగంలో చేరినప్పటినుంచి అతనికి ఇది మరీ ఎక్కువైంది. సాయంత్రం "మందు" వలె ఇతనికి "మంది" అవసరమవుతున్నారు. ఏదో ఒక సభలో వాగకపోతే అతని వంటినిండా తేళ్లు, జెర్రులు పాకుతాయి. కంపరం పుడుతుంది. మందు తాగలేడు. తిండీ తినలేడు. నిద్ర పట్టదు. తాత్కాలిక ఉపశమనం కోసం ఒకవేళ అర్జంటుగా మందు తాగినా, తాగిన తర్వాతయినా వాగక తప్పదు కదా? అగ్గికి ఆజ్యం పోసినట్లు - అప్పుడింకా ప్రమాదం! అందువలన "తాగుడును వాగుడును సమార్థములో గ్రహించనగును" - అంటూ తన శిష్య - ప్రశిష్యులందరికీ చెప్పాడు మనిషి.

వాగుడు కళలో ఆరితేరినప్పటి నుండి మనిషికి జీవితంలో నిచ్చెనలు, ఎదురవుతూ వచ్చాయి. ప్రతిసారీ సభలో - ముఖ్య అతిథి ఒక నిచ్చెన అయ్యేవాడు. అధ్యక్షుల వారు మరో నిచ్చెన అయ్యేవారు. స్వతంత్రమైన తన వాగరాగంలో మనిషి ఎన్నెన్నో ఖయాల్‌ల్లు మిళితం చేసేవాడు.

మనిషి మాటలగ్యాసు తమను ఉన్నఫళంగా ఆకాశానికి ఎలా ఎత్తగలుగుతోందని వి.వి.ఐ.పీ. లంతా అచ్చెరు వొందారు. వంట గ్యాస్ అయిపోతే మళ్ళీ బుక్ చేసుకోవాలి. దీనికి అలాంటిదేం లేదు.

మనిషే సిలిండర్‌గా ఎంతంటే అంత గ్యాస్ వదులుతూ ఉండడం అంతుబట్టని రహస్యంగా తయారయ్యింది. తమ విలువ ఎక్కడ పోతుందోనని, వి.వి.ఐ.పీ.లు మనిషికి అవార్డుల దండవేసి చేతులు దులుపుకున్నారు. సమున్నతమైన ఆసనం ఒకటి చేయించి, దానిమీది కెక్కించారు.

అవార్డు లొచ్చినప్పటినుండి మనిషికి మరో బలహీనత ఏర్పడింది. రోజుకు ఒక సభ సరిపోవడం లేదు. చాలా కావల్సి వచ్చాయి. పైగా తను మాట్లాడడం తప్ప, ఇతరులు మాట్లాడుతుండగా వినడం అతనితో అయ్యేది కాదు. వినలేడు. భరించలేడు. అందుకే సభల్లో చాలాసార్లు తను మాట్లాడడం కాగానే.... మధ్యలో లేచి పోతుండేవాడు. మనిషి మొదట్లో తనకు తెలిసిన నాలుగు ముక్కలే మాట్లాడేవాడు. అప్పుడు జనం సంతోషించేవారు. తరువాత్తరువాత, రచయిత్రుల పుస్తకాలపై మాట్లాడేవాడు. చొంగ కార్చుకునేవారికి, ఆడవాళ్ల రాసే సెక్స్ పద్యాలు ఆయననోట.... అమోఘంగా వినిపిస్తుండేవి. తను మాట్లాడిందంతా సిద్ధాంత చర్చే ననుకునేవాడు పాపం మనిషి. అయితే అందులో ఓ సౌకర్యం కూడా ఉండేది. అది అతడికి తప్ప మరొకడికి అర్థం కాదు గనక, జనం వాగనిచ్చేవారు. (వారికి తోచింది వారు మాట్లాడుకుంటూ కూచునేవారు) ఆ తర్వాత జల్ జల్ ప్రక్రియ, గజల్ జల్ ప్రక్రియ, హైకూ, డోకూ వంటి వాటిని పట్టుకున్నాడు. అందులో లలలలలు తప్ప అర్థం పర్థం ఉండేవి కావు -

ఆ తర్వాత, మనిషి సబ్జక్టేదయినా దంచి పడేసేవాడు. ఒకసారి చెప్పులషాపు ప్రారంభోత్సవ సభలో అమోఘంగా మాట్లాడి పారేశాడు. సభ తర్వాత చెప్పుల దుకాణదారు మనిషితో సవినయంగా ఇలా విన్నవించుకున్నాడు.

"అయ్యా తమరి సభ లెక్కడ జరిగితే నేనక్కడికి వచ్చేవాణ్ణి. అట్లా మీ ప్రసంగాలపై సంపాదించిన చెప్పులే ఇవన్నీ. ఈనాటికి

నాకో దారి చూయించారు. మీ రుణం ఈ జన్మలో తీర్చుకోలేను. మీ చెప్పులు కూడా విడిచి నా మొహాన పారెయ్యండి ! అప్పుకుంటాను" అన్నాడు. చెప్పు తీసి ముఖం పగులగొట్టినట్టయ్యింది మనిషికి. అక్కడినుండి తక్షణం మాయమయ్యాడు. మరోచోట మరో సమావేశ మేదైనా తగలదా అనుకుని ! "అయ్యా ! ఓ సభ పెట్టండి సార్ ! పిల్లలు గలవాణ్ణి" అని మనిషి అడుక్కోవడం కూడా ప్రారంభించాడు.

ఓ చోట మనిషి మాట్లాడగానే పోలీసులు వచ్చి అరెస్ట్ చేశారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాట్లాడాడని కాదు. నక్సలైట్లకు, టైగర్లకు, టెర్రరిస్టులకు, బోడోలకు.... ఎవరికో సహాయపడ్డాడని కాదు. ఉద్యమాల గూర్చి ఉపన్యసించాడనీ కాదు. నిజానికి మనిషి ఏ పాపమూ ఎరగడు. వాళ్ళంతా ఎవరో కూడా అతనికి తెలియదు. మనిషి ఉపన్యాసంలో 'సొళ్ళు' భరించలేక ప్రతి సభలో ఒకరిద్దరు.... గత్తర తగిలి పోయినట్లే ఠపీమని చచ్చిపోతున్నారట !' అదీ కంప్లైంట్ !: అందుకే పట్టుకుపొయ్యారు పోలీసులు. జైలు, అధికారులు మాత్రం బతుకుతారా ? నన్నది అనుమానం !

మనిషి మాత్రం జీవితంలో దేన్నో అన్వేషిస్తూ దేనికోసమో వాగుతూనే ఉన్నాడు

○

ఏప్రిల్ 1992